క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రాయదుర్గం రూరల్: మండలంలోని జంజురాంపల్లి సచివాలయ పరిధిలోని రేకులకుంట గ్రామంలో మంగళవారం ఉదయం 7 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ విద్యావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హొన్నే మల్లికార్జున, ఎంపీడీఓ కొండయ్య తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని వారు సోమవారం వారు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుంచి మారెమ్మ జాతర



తిమ్మాపురంలో కొలువైన అమ్మవారు

కంబదూరు: మండలంలోని తిమ్మాపురం, ఓబగానిపల్లి, జెక్కిరెడ్డిపల్లి, ఎర్రబండ, కదిరిదేవరపల్లిలో మంగళవారం నుంచి ఆరు రోజుల పాటు మారెమ్మ జాతర నిర్వహించనున్నారు. ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేశారు. తిమ్మాపురం లోని మారెమ్మ ఆలయాన్ని సర్పంచ్ సంధ్య, హరినాథ్ ఆధ్వర్యంలో ముస్తాబు చేశారు.

అంబాపురంలో కొల్లాపురమ్మదేవి జాతర

కణేకల్లు: మండలంలోని అంబాపురం గ్రామదేవత కొల్లాపురమ్మదేవి జాతర మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. జాతరకు గ్రామస్తులు సర్వం సిద్ధం చేశారు. ఊరంతా సందడిగా నెలకొంది. జాతర సందర్భంగా మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేయనున్నారు. రాత్రి 11 గంటల తర్వాత అమ్మవారి దేవరపోతును ఆలయం ముందు బలివ్వనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, పర్వతరెడ్డి, తిమ్మారెడ్డి, గ్రామపెద్దలు తెలిపారు.

చదువుతోనే సమాజాభివృద్ధి



క్యాలెండర్ విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, పద్మశాలీయ సంఘం పెద్దలు

రాయదుర్గంటౌన్: చదువుతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, తల్లిదండ్రులు తమ పిల్లల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప సూచించారు. పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయంలో సోమవారం పద్మశాలీయ ఉద్యోగుల సంఘం నూతన క్యాలెండర్‌ను ఆలయ ధర్మకర్త సోమ మల్లేశప్పతో చైర్‌పర్సన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అరవ శివప్ప, కౌన్సిలర్లు అరవ రేఖ, కొంతం దేవరాజు, పొరాళ్ల గోవిందరాజులు, ఆలయ సహకార్యదర్శి నాగప్ప, ఉద్యోగులు తాడూరు చంద్ర, కొంతం శివరుద్రప్ప, జగన్నాథ్, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, దివాకర్, కులస్తులు పొరాళ్ల రాజు, సోమ పాండు, రాము, మాజీ కౌన్సిలర్ పొరాళ్ల ధనార్జున, రిటైర్డ్ టీచర్ రామస్వామి, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లప్పస్వామి జాతర



జ్యోతులు మోస్తున్న భక్తులు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని తూర్పు కోడిపల్లి గ్రామంలో సోమవారం మల్లప్పస్వామి జాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్తులు జ్యోతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చీరలు, దుప్పట్ల పంపిణీ

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని పాలవాయి గ్రామంలో ఆదివారం షాలేం చర్చిలో పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పాస్టర్ జాన్‌పాల్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సామాజిక సేవ అవార్డు గ్రహీత చల్లా కిషోర్, క్రైస్తవులు పాల్గొని 30 మందికి చీరలు, దుప్పట్లు అందజేశారు.

ఎర్రిస్వామి సేవలు మరువలేనివి

కళ్యాణదుర్గం రూరల్: స్వాతంత్య్ర సమరయోధుడు బంగి ఎర్రిస్వామి సేవలు మరువలేనివని సీపీఐ నాయకులు కొనియాడారు. బంగి ఎర్రిస్వామి మెమోరియల్ భవనంలో సోమవారం ఆయన వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ నాయకులు సంజీవప్ప, మహదేవ్, వై గోపాల్, హరిదాసు, తిరుపాల్, అశ్వర్థ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి

కూడేరు: ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతిచెందాడు. వివరాలు.. మండలంలోని అవరకూరు–కమ్మూరు గ్రామాల మధ్య ఈ నెల 8న రోడ్డు ప్రమాదంలో కూడేరుకు చెందిన వడ్డే మణికంఠ (19), చెన్నకేశవ గాయపడిన విషయం తెలిసిందే. అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న చెన్నకేశవ ఈ నెల 9న పరిస్థితి విషమించి మృతి చెందాడు. చెన్నకేశవ కూడా సోమవారం వేకువజామున మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వెల్లివిరిసిన సంక్రాంతి శోభ

- ఆకట్టుకున్న రంగవల్లులు
- కిటకిటలాడిన ఆలయాలు



వజ్రకరూరు: అలంకరణలో జనార్దన వేంకట్వేరస్వామి, షిరిడీసాయినాథుడు





కూడేరు: పూజలందుకుంటున్న జోడు లింగాలు

సాక్షి నెట్‌వర్క్: తెలుగువారి అతి పెద్ద పండుగ సంక్రాంతి వేడుకలను ప్రజలు ఊరూరా సంబరంగా చేసుకున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గంలోని ప్రతి ఇంటా రంగువల్లులు, వాటి మధ్య గొబ్బెమ్మలు ఉంచి సంప్రదాయ పద్ధతులు ఉట్టిపడేలా పండుగ ప్రాముఖ్యతను చాటుకున్నారు. సద్ద రొట్టె, వేరుశనగ ఉండలు, ఇతర పిండి వంటకాలతో ఇళ్లన్నీ ఘుమఘుమలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భోగభాగ్యాలు దక్కాలని మొక్కులు తీర్చుకున్నారు. వీధుల్లో మహిళలు పోటాపోటీగా ముగ్గులు వేస్తూ సరదాలు పంచుకున్నారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ మురిసిపోయారు. గ్రామాల్లో యువకులు పలు క్రీడా పోటీలు నిర్వహించి పండుగ ప్రత్యేకతను చాటుకున్నారు. జై జగనన్న, హ్యాపీ పొంగల్, నవరత్నా పథకాలు తెలిపే త్రి చక్రం లాంటి రంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. కనుమ రోజు రైతులు పశువులను అలకరించి పూజలు చేశారు.

'కాపు' ఇంట సంక్రాంతి సందడి..

రాయదుర్గంలోని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి స్వగృహం వద్ద సంక్రాంతి వేడుకలు సందడి చేశాయి. పలు రకాల మగ్గులు, భోగి మంటలు వేస్తూ సరదాగా గడిపారు. కుటుంబ సభ్యులతో కలసి ఆయన పలు ఆయాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖ సంతోషాలు కలిగి ఉండాలని ఆకాంక్షించారు.

ఆలోచింపజేసేలా ముగ్గులు

సంక్రాంతి పండుగ వేళ ప్రతి ఇంటి ముందు కల్లాపు జల్లి రంగు రంగుల ముగ్గులు వేయడం ఆనవాయితీ. అయితే సమాజాన్ని జాగృతం చేసేలా ఉరవకొండ పట్టణంలోని పలు వీధుల్లో ఇళ్ల ముందు బాలికలు, మహిళలు ముగ్గులు వేశారు. రైతును గౌరవించండి, రైతు దేశానికి వెన్నముక, రైతే రాజు, అన్నదాత సుఖీభవ, సేవ్ ద గర్ల్, మహిళలను గౌరవించడండి, మొక్కలను పెంచండి, వాయు కాలుష్యాన్ని నిరోధించండి, నీటిని పొదుపుగా వాడండి తదితర సందేశాలతో ముగ్గులు వేశారు. రంగావీధి, పాలపేట, ఎస్‌ఎల్‌ఎన్ కాలనీల్లో ఈ ముగ్గులు దర్శనమిచ్చాయి.

జోడు లింగాల ఆలయానికి పోటెత్తిన భక్తులు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదివారం కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయానికి జిల్లా కేంద్రం, మండలం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేపట్టి, జోడు లింగాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు జోడు లింగాలకు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. అలాగే వజ్రకరూరులోని జనార్దన వేంకటేశ్వరస్వామి, షిరిడీసాయి ఆలయం, నగరేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.



బొమ్మనహాళ్: సంక్రాంతి శుభాకాంక్షలు అంటూ వేసిన రంగవల్లి



ఉరవకొండ: డ్రైవర్స్ కాలనీలో సేవ్ వాటర్, సేవ్ ట్రీస్ అంటూ ముగ్గు వేసిన దృశ్యం



కంబదూరు: ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట రంగవల్లి



రాయదుర్గం: ముగ్గు వేసి గొబ్బెమ్మలకు పూజలు చేస్తున్న మహిళ

తిప్పేరుద్రస్వామి ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ దంపతులు

బ్రహ్మసముద్రం: మండలంలోని ఎరడికెర గురుతిప్పేరుదస్వామి ఆలయాన్ని సోమవారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి , ఆయన సతీమణి రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి సందర్శించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలు, రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

వడ్డెర్ల సభ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకులు

ఉరవకొండ: పట్టణంలో ఫిబ్రవరి 1న నిర్వహించే వడ్డెర్ల నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు భీమేష్ బాబు, గోవిందురాజులు, ఆంజనేయులు, లాలుస్వామి, వీరన్నబాబు, గంగరాజు, హంపయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. వడ్డెర్ల హక్కుల సాధన కోసం ఉరవకొండలో వచ్చే నెల 1న భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఉరవకొండలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటు, వడ్డెర్లను ఎస్టీ జాబితాలో కలపాలని కోరుతూ సభ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. వడ్డెర్లు పెద్దఎత్తున తరలివచ్చి సభ విజయవంతం చేయాలన్నారు.

సంక్షేమ పథకాలు అందుతున్నాయా..?

- 'గడప గడపకూ' కార్యక్రమంలో మంత్రి ఉషశ్రీచరణ్



ఉప్పొంకలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం రూరల్: ఏమ్మా అందరూ బాగున్నారా.. సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. జగనన్న ప్రభుత్వం ఎలా ఉంది.. అంటూ రాష్ట్ర మంత్రి ఉషశ్రీచరణ్ మహిళలను ఆరా తీశారు. మండలంలోని గరుడాపురం పంచాయతీలోని ఉప్పొంక, యర్రంపల్లి గ్రామాల్లో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా..లేదా అంటూ అడిగి తెలుసుకున్నారు. పింఛన్ వస్తోందని ఒకరు, వైఎస్సార్ చేయూత వచ్చిందని మరొకరు, అమ్మఒడి అందిందని ఇంకొకరు మంత్రి ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలో ఇలా పథకాలు అందాయా అని మంత్రి ప్రశ్నించగా లేదు మేడమ్.. జగనన్న ప్రభుత్వంలోనే మేలు జరిగిందని ప్రజలు చెప్పుకొచ్చారు. మళ్లీ జగనన్ననే సీఎం చేసుకోవాలని ప్రజలను కోరారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయచౌదరి పచ్చ పేపర్లను అడ్డుపెట్టుకుని విమర్శలు చేయడం మినహా నియోజకవర్గానికి చేసిందేమీలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు మారుతమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీలు బొమ్మన్న, గుద్దిళ్ల నాగరాజు, జానపద సృజనాత్మక అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ బాబురెడ్డి , కన్వీనర్లు భాస్కర్‌రెడ్డి, గోపారం శ్రీనివాసులు, బసవరాజు, నాయకులు తిరుమల వెంకటేశులు, సిద్దప్ప, వెంకటేశులు, జయరాంచౌదరి, హనుమంతరాయుడు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటా



సంక్షేమ పథకాలతో లబ్ధి పొందాను. వైఎస్సార్ చేయూత డబ్బులతో మూడు విడతల్లో మూడు ఆవులు కొన్నాను. సంఘంలో రుణం పొంది తీసుకున్న ఆటోతో మనవడు ఉపాధి పొందుతున్నాడు. భర్త చౌడప్పకు పింఛన్ అందుతోంది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా.

– వన్నూరమ్మ, యర్రంపల్లి

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



అప్పటి ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు

బెళుగుప్ప: మండలంలోని వెంకటాద్రిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పాఠశాల 66వ వార్షికోత్సవం పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. 1956లో ప్రారంభించిన పాఠశాలలో ప్రస్తుత హెచ్‌ఎం వేణుగోపాల్ అధ్యక్షతన పదవీ విరమణ ఉపాధ్యాయులు శ్రీరాములు, రమేష్‌బాబు, అమలినేని రామకృష్ణ తోడ్పాటుతో వార్షికోత్సవం చేపట్టారు. పాఠశాలలో 1960లో పని చేసిన ఉపాధ్యాయులు ప్రస్తుతం 92 సంవత్సరాల వయస్సు ఉన్న లక్ష్మయ్యతో పాటు వెంకటేశులు, సత్యనారాయణ, చలపతి, శ్రీనివాసరావు, కమలనాభుడు ,రామిరెడ్డి, వెంకటేశులు, నరసింహులును నాటి విద్యార్థులు గ్రామస్తులు పూలమాలలు వేసి దుశ్శాలువాలతో సన్మానించారు. తమ పాఠశాలకు 2021–22లో రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డు రావడం సంతోషదాయకమని వారు హర్షం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కణేకల్లు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ 1987–89 ఇంటర్ విద్యార్థుల సమ్మేళనం సోమవారం స్థానిక ప్రసాద్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఆ బ్యాచ్‌కు చెందిన కొందరు స్థానికంగా వివిధ వ్యాపారాలు చేసుకుంటూ స్థిర పడగా... అనేక మంది ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. పాటిల్ సత్యనారాయణరెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా అమెరికాలో పని చేస్తూ ఇటీవల స్వగ్రామమైన గెనిగెరకు రావడంతో అందరూ ఒక్కసారి కలవాలన్న ఆలోచనతో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 130 మంది విద్యార్థులుండగా 80 మంది కుటుంబసమేతంగా హాజరయ్యారు. అప్పటి ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, కిష్టప్ప, వెంకటకిష్టప్ప, శ్రీనివాసమమూర్తి, వన్నూరుసాహెబ్, వేణుగోపాల్, నాన్‌టీచింగ్ స్టాఫ్ చెన్నయ్య, హమీద్‌ను సత్కరించారు. తాము చదువుకున్న కాలేజీకి జ్ఞాపకంగా త్వరలో ఓ మంచి కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

అగ్నిగుండం నుంచి మంటలు!

కణేకల్లు: మండలంలోని ఎస్.హనుమాపురంలో లాలూస్వామి పీర్లచావిడి ముందున్న అగ్నిగుండం ఐదు నెలల తర్వాత కూడా మండుతూ కన్పించింది. మొహర్రం వేడుకల్లో భాగంగా లాలూస్వామి పీర్లు జలధికి వెళ్లిన అనంతరం.. అదేరోజు అగ్నిగుండాన్ని పూడ్చేస్తారు. అగ్నిగుండంలో కొంత కలప కాలుతూ ఉన్నా.. దానిపై మట్టి వేసి పూడ్చిన తర్వాత మంటలన్నీ చల్లారిపోవడం సహజం. అగ్నిగుండాన్ని పూడ్చిన తర్వాత భారీ వర్షాలు వచ్చాయి. లోపల ఏమాత్రం నిప్పురవ్వలున్నా వర్షానికి చల్లబడాల్సిందే. అయినప్పటికీ ఐదు నెలల తర్వాత అగ్నిగుండం లోపల నుంచి మంటలు వస్తూ కనబడటంతో గ్రామస్తులు ఇది ఓ అద్భుతంగా... లాలూస్వామి పీర్ల మహత్యంగా భావిస్తున్నారు. గ్రామస్తులు పీర్లచావిడికెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

వజ్రకరూరు: మండలంలోని గడేహోతూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆవుల రాజశేఖర్(43) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. మధ్యాహ్నం ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు వెంటనే ఉరవకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు వై.భీమిరెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడికి భార్య సుంకులమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

టెంకాయల వేలం రేపు..

బెళుగుప్ప: మండలంలోని రామసాగరం గ్రామ సమీపంలో ఉన్న బూదిగుమ్మ ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద ఏడాది కాలపరిమితికి సంబంధించి పూజాసామగ్రితో కూడిన టెంకాయల వేలం పాటను బుధవారం నిర్వహించనున్నట్టు మండల ఈఓ ఈశ్వర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. రామసాగరం గ్రామంలోని శ్రీరామస్వామి ఆలయం వద్ద ఉదయం 11 గంటల నుంచి వేలం కొనసాగుతుందని, హిందువులు మాత్రమే పాల్గొనాలన్నారు. ఆసక్తి ఉన్న వారు డిపాజిట్ రూ.1000 చెల్లించాలన్నారు.

మద్యం విక్రేతల అరెస్టు

శెట్టూరు: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వాహన తనిఖీల్లో భాగంగా సోమవారం శెట్టూరు సమీపంలో ఎస్‌ఐ యువరాజు ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీ చేపట్టారు. శెట్టూరుకు చెందిన కమలాక్షి, రాము, కోడిపల్లి మల్లికార్జున బైకులో కర్ణాటక ప్రాంతం తిప్పరెడ్డిపల్లి నుంచి శెట్టూరుకు హైవార్డ్స్ విస్కీ 90 మి.లీల సామర్థ్యం ఉన్న 95 టెట్రా ప్యాకెట్లను తీసుకొస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి టెట్రా ప్యాకెట్లు, బైకును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

గుజిరీ దుకాణంలో అగ్ని ప్రమాదం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని అబ్దుల్ గుజరీ దుకాణంలో ఆదివారం మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారం మేరకు ఫైరింజన్ చేరుకుని గుజరీలోని మంటలను పూర్తిగా ఆర్పివేసింది. దుకాణంలో ప్లాస్టిక్ సామానులు, అట్టల నిల్వలతో పాటు సూక్ష్మబిందు పైపులు ఉన్నాయి. గృహాలు, పశుగ్రాస గడ్డివాములు సమీపంలో ఉండటంతో మంటలు విస్తరించి ఉంటే పెనుప్రమాదం సంభవించి ఉండేదని స్థానికులు వాపోయారు.